తల్లిపాలు.. అమృత ధారలు..

- తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు


కంచికచర్ల మండలం మున్నలూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

కంచికచర్ల: అమ్మపాలు అమృతంతో సమానం. బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలు. ఇది ప్రకృతి వరం. దీనికి మరేదీ సాటిరాదు. అయితే కొన్ని అపోహలతో, ఆధునిక పోకడలతో కొందరు తల్లులు బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో ప్రతీ ఏటా శిశు మరణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్నారు.

ముర్రుపాలు తప్పనిసరిగా తాగించాలి..

పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తప్పనిసరిగా తాగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. పగటి పూట ఇచ్చే పాల కన్నా రాత్రి పూట పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికి, బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది. పాలిచ్చేటప్పుడు తల్లి ఒడిలోని వేడి బిడ్డకు చేరి చాలా వ్యాధులు దరిచేరవు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

నియోజకవర్గంలో ఒకే ఐసీడీఎస్ ప్రాజెక్టు..

నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గతంలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులుండేవి. ఒకటి నందిగామ, మరొకటి కంచికచర్లలో ఉండేది. కంచికచర్ల ప్రాజెక్టును తీసివేసి ప్రస్తుతం ఒకే ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. అదీ నందిగామలో ఉంది. కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో 229 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 6 నెలల నుంచి మూడేళ్లలోపు 6,908 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు 6,475మంది చిన్నారులున్నారు. గర్భిణులు 1,385మంది, బాలింతలు 1,163మంది ఉన్నారు.

ఈనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమాల్లో తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుపుతున్నాం

తల్లిపాల వారోత్సవాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలిస్తే ఆరోగ్యం పెరుగుతుంది.

వి. భాగ్యరేణుక, సీడీపీఓ, నందిగామ

క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి



వత్సవాయి: రైతులు తాము సాగుచేసిన పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏడీఏ సీహెచ్ భవాని సూచించారు. మంగళవారం వత్సవాయిలో పంట నమోదు కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారిణి వర్ధినితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఈఓలకు పంట నమోదుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట నమోదులో ఏ విధమైన తప్పులు లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే నమోదు చేయాలన్నారు. రైతులు తమ పూర్తి వివరాలతో గ్రామంలోని రైతు సేవాకేంద్రాల వద్ద సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి



నందిగామ టౌన్: బ్యాంకు అధికారులు ఖాతాదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా ప్రత్యేకాధికారి ఉమాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంయుక్త మండల స్థాయి బ్యాంకర్ల సమితి సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి డిపాజిట్ల సేకరణ, రైతులకు పంట రుణాలు, ప్రధాన మంత్రి విశ్వకర్మ తదితర పథకాలకు సంబంధించిన రుణాలను విధిగా అందించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో విశ్వనాథ్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో 33.2 మి.మీ.ల వర్షం



వీరులపాడు: మండలంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 33.2 మి.మీల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే సాగు చేసిన మొక్కజొన్న, పెసర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ముఖ్యంగా పెసర పంట పూత, పిందె పూర్తిగా రాలిపోతోందని వ్యవసాయాధికారులు అంటున్నారు. అంతేకాకుండా మొక్కజొన్న పంట సైతం ఎదుగుదల లోపించి మొక్కలు ఎర్రబడి దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఎల్ఐసీ శాటిలైట్ శాఖ వార్షికోత్సవం

తిరువూరు: తిరువూరులోని భారతీయ జీవిత బీమా సంస్థ శాటిలైట్ శాఖ 16వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. శాఖా కార్యాలయంలో సీనియర్ బ్రాంచి మేనేజరు సుధాకర్ కేక్ కట్ చేసి వేడుకలు మాట్లాడుతూ నూజివీడు ఎల్ఐసీ కార్యాలయానికి అనుబంధంగా తిరువూరు శాటిలైట్ శాఖ సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. కార్యాలయ మేనేజర్ రమేష్, ఏఓలు వెంకటేశ్వర్లు, ఫరీద్, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి


ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాసి పంపుతున్న వలంటీర్లు

నందిగామ టౌన్: ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థను తిరిగి కొనసాగించడంతో పాటు వలంటీర్లకు నిలిచి పోయిన రెండు నెలల గౌరవ వేతనాన్ని తక్షణమే అందించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం వలంటీర్లను తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాసి పంపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వారి సేవలను గుర్తించి వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వారికి రూ. 10 వేల గౌరవ వేతనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర, లంకా గోవిందరాజు, మన్నే హనుమంతరావు, కట్టా చామంతి, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

కొండెక్కిన పూలు, పండ్ల ధరలు


మార్కెట్‌లో పూలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జగ్గయ్యపేట: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పూలు, పండ్లకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ప్రతి రోజు ఆలయాలకు వెళ్లే భక్తులు పూలు, పండ్లును తీసుకువెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. ఈ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఎక్కువగా చేస్తుండటంతో వాటికి గిరాకీ పెరిగింది. నిన్నటి వరకు మూర మల్లెపూలు రూ. 20 ఉండగా ప్రస్తుతం రూ. 40 పలుకుతోంది. అదేబాటలో విరజాజులు, కనకాంబరాలు, లిల్లీపూలు, గులాబీల ధరలు కూడా కొనసాగుతున్నాయి. అలాగే అరటి పండ్లు డజను రూ. 60 పలుకుతుంది. ద్రాక్ష పండ్లు కిలో రూ. 50 ఉంటే ప్రస్తుతం రూ. 70కు విక్రయిస్తున్నారు. పెరుగుతున్న ధరలు చూసి వినియోగదారులు బెంబేలెత్తున్నారు. మరికొద్ది రోజుల్లో వరలక్ష్మి వ్రతం, రాఖీపౌర్ణమి, కృష్ణాష్టమి వేడుకలు ఉండటంతో పూలు, పండ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


చిల్లకల్లులో గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ తదితరులు

నందిగామ టౌన్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే తల్లిపాలు తాగించాలని తెలిపారు. అనంతరం చిన్నారుల బరువు చూసి బాలసంజీవని, పాలు, తదితర కిట్లను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ముర్రుపాలు విశిష్టతపై అవగాహన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పుట్టిన శిశువుకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని భూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ముర్రుపాలు విశిష్టతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, సీడీపీవో లక్ష్మీభార్గవి, ఎల్‌సీపీవో కిరణ్, ఏసీడీపీవో నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌లతో ఆర్డీఓ రవీంద్రరావు సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ టౌన్: కురుస్తున్న వర్షాలకు నందిగామ డివిజన్ పరిధిలోని నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని తహసీల్దార్‌లతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రవీంద్రరావు మాట్లాడుతూ ధృవపత్రాలు, కౌలు రైతు కార్డులు, ప్రజా సమస్యల అర్జీలపై జాప్యం లేకుండా పరిష్కరించాలని తెలిపారు. అంతేకాకుండా వరదలు వస్తున్నందున నదీ పరివాహ ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై ఏఎన్ఎంలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న స్వాంతన కోఆర్డినేటర్ కేశవ

ఇబ్రహీంపట్నం: మానసిక ఆరోగ్యం, ఆత్మస్థైర్యంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో స్వాంతన కో-ఆర్డినేటర్ కేశవ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి గురైన వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించే అంశాలపై ఏఎన్ఎంలు, ఆశాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో మానసిక స్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడే వారికి రక్షణగా ఏఎన్ఎంలు నివాలన్నారు. వారిలో మానసిక స్థైర్యం పెంచాలని సూచించారు. అటువంటి వారికి వాసవ్య మహిళా మండలి ఆసరాగా ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా బైపాస్ రోడ్డు




బైపాస్ రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలు

మండల కేంద్రం పెనుగంచిప్రోలు బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. చెరువుమట్టి ట్రాక్టర్లకు తోడు భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు మొత్తం పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో కిందపడి గాయాలపాలవుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– పెనుగంచిప్రోలు

ప్రవాహంలో పడవ ప్రయాణం



శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి పులిచింతల దిగువకు నీటిని విడుదల చేయడంతో ముక్త్యాల గ్రామంలోని కృష్ణానది ఒడ్డునున్న భవానీ ముక్తేశ్వర స్వామివారి ఆలయం నీట మునిగింది. అయితే వరద నీరు ఉధృతంగా వస్తున్నా ముక్త్యాల వద్ద పడవ ప్రయాణాలు సాగుతూనే ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

– జగ్గయ్యపేట

ఎస్ఎంసీ ఎన్నికల్లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ-2 చిట్టిబాబు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల ఎనిమిదో తేది గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు నిబంధనల మేరకు నిర్వహించాలని ఎంఈఓ-2 చిట్టిబాబు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎస్ఎంసీ ఎన్నికలపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ వత్తిళ్లకు గురికాకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. 61 పాఠశాలల్లోనూ చేతులెత్తే పద్ధతి ద్వారానే ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల జాబితాను అదే రోజు అందించాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓలు ఎన్నికలను పర్యవేక్షిస్తారని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద బారులుదీరిన లారీలు


కంచికచర్ల మండలం కీసర ఇసుక పాయింట్ వద్ద నేషనల్ హైవేపై బారులుదీరిన లారీలు

కంచికచర్ల: ఇసుక స్టాక్ పాయింట్ వద్ద భారీగా లారీలు, టిప్పర్లు బారులుదీరాయి. మండలంలోని కీసర నేషనల్ హైవే పక్కన ఇసుక స్టాక్ పాయింట్ ఉంది. ఈ స్టాక్ పాయింట్ నుంచి విజయవాడ, మచిలీపట్నం తదితర పట్టణాలతో పాటు తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు పెద్ద పెద్ద లారీల ద్వారా స్టాక్ పాయింట్ వద్ద అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం కూడా చెల్లించకుండా ఇసుకను తరలిస్తున్నారు. స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహించే అధికారులు సైతం అక్రమ రవాణాదారులకు కొమ్ముకాస్తున్నారు. ఏది ఏమైనా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను అధికారులు గుర్తించి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుందని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీరామ సంగీత అకాడమీకి చెందిన పలువురు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు అందరిని అలరించాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మంగళవారం సాయంత్రం జి. జానకీ శిష్య బృందంలోని జానకీ, ఉమశ్రీ, భార్గవి, సాయి సుశ్మిత, గాయత్రి పలు కీర్తనలను ఆలపించింది. వీరికి వయోలిన్‌పై పి. దక్షిణామూర్తి, మృదంగంపై ఫణికుమార్ చక్కటి సహకారం అందించారు. భక్తిరంజనీ అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.


పెనుగంచిప్రోలు వద్ద తటాకాలు తలపిస్తున్న పత్తి చేలు


లింగగూడెం వద్ద వాగు పొంగడంతో పొలాల్లో చేరిన వరద నీరు


అనిగండ్లపాడు వద్ద నీట మునిగిన పొలాలు

ఉప్పొంగిన వాగులు

పెనుగంచిప్రోలు మండలంలో సోమవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లింగగూడెం వద్ద గండివాగు, ముచ్చింతాల-తాళ్లూరు మధ్య, గుమ్మడిదుర్రు వద్ద వాగులు ఉప్పొంగాయి. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాగుల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద నీటికి పంట పొలాలు నీట మునిగాయి. ఇలా అయితే పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

– పెనుగంచిప్రోలు


ముచ్చింతాల-తాళ్లూరు మధ్య వాగు చప్టాపై వరద నీరు

నెమలిలో 250 మందికి రక్త పరీక్షలు


నెమలిలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

నెమలి(గంపలగూడెం): గ్రామంలో విష జ్వరాలు ప్రబలి పలువురు ఇబ్బందులు పడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి సుహాసిని, జిల్లా మలేరియా అధికారి మోతేబాబు సోమవారం అర్ధరాత్రి నెమలిలో ఆకస్మికంగా పర్యటించారు. పలువురిని విచారించి పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు పెట్టి ప్రజలకు సరైన వైద్య సదుపాయం కల్పించాలంటూ గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులను ఆదేశించారు. దీంతో మంగళవారం వైద్యులు శృతి, సురేష్‌ల పర్యవేక్షణలో గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామంలో పర్యటించి ఎవరైనా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారా..? అని ఆరా తీశారు. అనుమానం ఉన్న 250 మంది నుంచి రక్త నమూనా సేకరించి పరీక్షలు జరిపినట్లు వైద్యులు శృతి తెలిపారు. ఎవ్వరికీ డెంగీ జ్వరాలు లేవని, కొందరు నార్మల్ జ్వరంతో ఉండగా వైద్యసేవలు అందజేశామని తెలిపారు.